# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శుక్రవారం 06-12-2024   సంపుటి : 06   సంచిక : 66   పేజీలు : 8   వెల : రూ 3-00


## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై మంత్రి నాదెండ్ల కీలక వ్యాఖ్యలు

విశాఖపట్నం, డిసెంబర్ 5: ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీరియస్‌గా ఉన్నారని.. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. బియ్యం అక్రమ రవాణాపై 1066 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వంతో రైస్ మిల్లర్ల అసోసియేషన్ కలిసి పని చేయాలన్నారు. రైతులెవరు ఆందోళన చెందవద్దని.. రాష్ట్రంలో పండిన ప్రతి ధాన్యపు గింజ కొంటామని స్పష్టం చేశారు. పది రోజుల్లో 10.59 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787


## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం... ఏపీకి తీవ్ర హెచ్చరిక



అమరావతి, డిసెంబర్ 5ఆంధ్రప్రదేశ్ ను వర్షాలు వీడనంటున్నాయి. బంగాళాఖాతంలో ఒకదాని తర్వాత మరొకటి అల్పపీడనాలు ఏర్పడుతుండటంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటికే ఫెంగల్ తుఫాను ప్రభావంతో అందినకాడిని పంటలను రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. భారీ వర్షాలున్నాయనే హెచ్చరికతో ప్రభుత్వం కూడా రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను రికార్డు స్థాయిలో పూర్తిచేసింది. రేపు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల ఆరు, ఏడు తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. బలహీనపడిన ఫెంగల్ ఆవర్తనంపై శుక్రవారం ఒక స్పష్టత వస్తుంది. ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. గురు, శుక్రవారాల్లో దక్షిణ కోస్తాలో తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. రెండు మూడు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వానలు కురవనున్నాయి. శుక్రవారం బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం శ్రీలంక దిశగా పయనిస్తుంది. ఇప్పటికే కోస్తా జిల్లాల్లో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. రాయలసీమ జిల్లాల్లో మాత్రం నమోదవలేదు. "బీ అలర్ట్, ఏపీకి భారీ వర్షాలు- స్కూళ్లకు సెలవు, తాజా హెచ్చరికలు..!!" హోం మంత్రి అనిత సమీక్ష రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో చలి తీవ్రత పెరిగింది. ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. గురువారం అన్నమయ్య, కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, అల్లూరి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. అలాగే తిరుపతి, చిత్తూరు, నంద్యాల, కర్నూలు, పల్నాడు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఏపీలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ శాఖ ల విభాగాధిపతులతో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తీసుకోవల్సిన చర్యలపై వారికి సూచనలు జారీచేశారు. సైరన్ అలారం సిస్టం పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్



అమరావతి, డిసెంబర్ 5 (ఆర్ఎన్ఎ): కృష్ణా జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులు కస్టోడియల్ ఆఫీసర్, టీఎలను సస్పెండ్ చేసింది. లారీల్లో ఎక్కువ బస్తాలు ధాన్యం లోడ్ చేస్తూ..., రికార్డులలో మాత్రం తక్కువ చూపిస్తున్న వైనంపై బుధవారం మీడియా ప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి ఈ అవకతవకల ఘటనపై ఆధారాలను స్వయంగా పరిశీలించారు. రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి..., రికార్డుల్లో మాత్రం తక్కువ చూపిస్తూ... అధికారులు - మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతుల నుంచి ఆరోపణలు వచ్చాయి. రైతుల ఫిర్యాదులపై గత రాత్రి సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. రైతుల నుండి నిరంతరంగా ధాన్యం కొనుగోలు జరగాలని ఆదేశించారు. పౌరసరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసి ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా అవకతవకలు ఆధారాలను మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. శాఖపర చర్యలకు ఆదేశించారు. కస్టోడియల్ ఆఫీసర్, టీఎలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రభుత్వ చర్యలతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఫిర్యాదు చేసిన రైతులకు ఎమ్మార్వోల నుంచి ఫోన్లు వెళ్లాయి. వ్యక్తిగతంగా కలిసి సమస్య పరిష్కరించుకోవాలంటూ కొందరు రైతులకు ఎమ్మార్వో ఫోన్ చేశారు. కాగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్ ఆదేశాల మేరకు అధికారులు రైసు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, లీగల్ మెట్రాలజీ, పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలు బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కృష్ణా జిల్లాలోని రైసు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖరీఫ్ ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. కాగా 'దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోండి. మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. 12 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.' అని రైతులకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు మాజేరు వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని పాతమాజేరు, లంకపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం అడ్డరోడ్డు, చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు, కాసానగర్, పెదప్రోలు ప్రాంతాల్లో హైవేపై దారి పొడవునా ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులున్న ప్రతిచోటా వాహనం దిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షానికి ధాన్యం తడవడం, కొద్దిమేర మొలకెత్తటం, తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకుంటున్నామని, తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని, తీసుకున్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు మంత్రికి తెలిపారు. 1262, 1224 రకం ధాన్యం కొనుగోలు చేయటంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి గింజా ప్రభుత్వ మద్ధతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ప్రోత్సహించవద్దని, సమస్యలుంటే రైతుసేవా కేంద్రానికి వెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు.

## ఎంపీ విజయసాయి రెడ్డిపై లుక్ ఔట్ నోటీస్

అమరావతి, డిసెంబర్ 5 : వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. ఆయనతోపాటు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో యజమాని శరత్ చంద్ర రెడ్డిపై ఎల్వోసీ ఇచ్చింది. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా ఈ సర్క్యులర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ. 3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు, కేవీ రావు నుంచి గత ప్రభుత్వ హయాంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో కీలక నిందితులుగా వీరున్నారు. వాటాలు రాసివ్వకపోతే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కేవీ రావును బెదిరించి, భయపెట్టి అత్యధిక షేర్లను అరబిందో సంస్థ సొంతం చేసుకుందనేది ప్రధాన అభియోగం. దీనిపై కేవీ రావు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో విజయసాయిరెడ్డి, విక్రాంత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి.. ఈ ముగ్గురు కీలక నిందితులుగా ఉన్నారు. కేవీ రావు స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేస్తున్నారు. విక్రాంత్ రెడ్డిపై ఇప్పటికే సీఐడీ గురిపెట్టింది. కేవీ రావుతోపాటు మరికొందరి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. అధికారులు కేసు రిజిష్టర్ చేసిన వెంటనే లుకౌట్ నోటీసులుజారీ చేశారు. ఈ ముగ్గురు విదేశాలకు పారిపోకుండా దేశంలో ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఎల్వోసీలు పంపినట్లు సీఐడీ అధికారులు పేర్కొన్నారు. వారిని విచారించేందుకు త్వరలో నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

### ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణ స్వీకారం

### డిప్యూటీలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణం




ముంబై, డిసెంబర్ 5 : ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎయిజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువరు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫడ్నవీస్ రెండోసారి 2014 నుంచి 2019 వరకు బీజేపీ-శివసేన ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. 2019 ఎన్నికల తరువాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన సిఎం పదవి కోసం బిజెపితో సంబంధాలు తెంచుకున్నప్పుడు, ఫడ్నవీస్ తిరిగి అజిత్ పవార్ మద్ధతుతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. పొందడంలో అజిత్ పవార్ విఫలం కావడంతో ఈ ప్రభుత్వం కేవలం 72 గంటలు మాత్రమే కొనసాగింది. అనంతరం, శివసేనలో చీలిక రావడంతో షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

## ఏసీబీని కూటమి ప్రభుత్వం పంజరం లో పెట్టింది

### వైఎస్ షర్మిలా రెడ్డి




విజయవాడ,అదానీ పై అమెరికాలో దర్యాప్తు జరుగుతుంది. సోలార్ పవర్ డీల్ లో జగన్ కి 1750 కోట్లు ముడుపులు ఇచ్చారని వెల్లడి అయ్యింది. ఈ విషయాన్ని అమెరికా ఎఫ్బీఐ వెల్లడించింది. ఆధారాలు కూడా బయట పెట్టిందని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. గురువారం ఆమె పార్టీ నేతలతో కలిసి ఏసీబీ కార్యాలయం ముందు పంజరంతో నిరసనకు దిగారు.షర్మిల మాట్లాడుతూ ఇంత జరుగుతుంటే మన దర్యాప్తు సంస్థలు నిద్ర పోతున్నాయా ? ఇంత అవినీతి జరిగితే మన రాష్ట్రంలో దర్యాప్తు సంస్థలు ఎందుకు బయటపెట్టలేదు ? 2021 లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ సోలార్ డీల్ పై హైకోర్టు లో పిటీషన్ కూడా వేశారు. ఇదొక కుంభకోణం అని ఇప్పటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల ఆర్థిక భారం అని ఆరోపణ చేశారు. అదానీ డీల్ వెనుక అవినీతి జరిగిందని తెలుసు. ఇప్పుడు మీరే అధికారంలో ఉన్నారు. కోర్టు కేసు వేసిన పయ్యావుల మంత్రిగా అన్నారు. అధికారం చేతుల్లో పెట్టుకొని ఏం చేస్తున్నారు? జగన్ కి నష్టం లేదు..మీకు నష్టం లేదు. నష్టం జరిగేది రాష్ట్ర ప్రజలకు మాత్రమే. అదానీ తో 25 ఏళ్ల ఒప్పందం అంటే రాష్ట్రం నెత్తిన అధికార భారం పడుతుంది. ఒకప్పుడు సోలార్ పవర్ యూనిట్ కి 10 రూపాయలు ఉండేది. ఇప్పుడు యూనిట్ ధర 1.99 పైసలకు తగ్గింది. రేపు 50 పైసలకే వచ్చినా తగ్గొచ్చు. సోలార్ పవర్ రెట్లు తగ్గుంటుంటే... మీరు ఎలా 25 ఏళ్లకు అగ్రిమెంట్ చేశారు ? 2.49 పైసలకు కొని రాష్ట్రం నెత్తిన లక్ష కోట్ల భారం ఎందుకు భారం మోపారు. - చంద్రబాబు ను అడుగుతున్నాం. అదానీ మీద మీరు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు ? అదానీ అనే పేరు కూడా ఎందుకు ఉచ్చరించడం లేదని అన్నారు.అదానీ బీజేపీ మనిషి..మోడీ మనిషి. బీజేపీ తో మీకు అలయెన్స్ ఉంది. అందుకే మీరు అదానీ కి, మోడీ కి బయపడుతున్నారు. అదానీ నీ కాపాడుతున్నారు. రాహుల్ గాంధీ సైతం పార్లమెంట్ లో పోరాటం చేస్తున్నారు. జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయినా మోడీనోరు విప్పడం లేదు. మొత్తం దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకున్నారు. అమెరికా దర్యాప్తు సంస్థలు చెప్తే కానీ అవినీతి బయటకు రాలేదు ? ఈ అవినీతి బయట పెట్టని సిబిఐ చేతకానిదా? మోడీ చేతకాని వాడా ? ఇవ్వాళ కాంగ్రెస్ పార్టీ ఏసీబీ కి పిర్యాదు చేసింది. దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఏసీబీ స్వయం ప్రతిపత్తి గల సంస్థ. కానీ రాష్ట్రంలో ఏసీబీనిబంధి చేశారు. పంజరంలో చిలక మాదిరిగా బంధి చేశారు.

## కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణలో జగన్‌ను ఏ1గా చేర్చాలి

### ఆక్వాకల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి

నెల్లూరు, డిసెంబర్ 5 : కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణల కేసులో జగన్‌ఏ1గా ఎఫ్ఐఆర్‌లో సీఐడీ చేర్చాలని ఆక్వాకల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు పందుల గుంపు మాదిరి 8320 ఎకరాల కాకినాడ సెజ్ దోపిడీకి దిగారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. కత్తులు, గన్నులతో కేవీరావును అన్ని విధాలా బెదిరించి భయపెట్టి 4 వేల ఎకరాల భూమిని కేవలం 12 కోట్ల రూపాయల పేరుతో అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. భారతదేశంలో రూ.29 వేలకు ఎక్కడా దొరకని ఎకరా భూమి జగన్ వర్గీయులకు మాత్రమే కాకినాడ సెజ్‌లో ఎలా దొరుకుతుందని ఆయన ప్రశ్నించారు. డబ్బులు సంపాదించే కంపెనీని బెదిరించి గుంజుకోవటం వీరి నైజమని అన్నారు. ప్రముఖ కన్సల్టెంట్ రోహిత్ చతుర్వేది ఇచ్చిన నివేదిక ప్రకారం కాకినాడ సెజ్‌లో ఎకరా రేటు రూ. 50 లక్షల పైచిలుకు ఉందని ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. 2 వేల కోట్ల రూపాయల విలువైన కేవీరావు వాటా భూమిని రూ.12 కోట్లు ఇస్తామని చెప్పి కొట్టేశారన్నది సుస్పష్టమన్నారు. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు కూడా 6 నెలల తర్వాత బ్యాంకులో జమ చేసుకోమనటాన్ని దోపిడీ అనాలా దొంగతనం అనాలా.. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు 6 నెలల తర్వాత జమ కావటం సాధ్యమా.. అని ప్రశ్నించారు. జగన్ ప్రమేయం లేకుండా ఇది జరగని పని అని, కాకినాడ పోర్టు కైవసం కోసం భారీ మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సెల్టెంట్లు ఆడిట్ చేసి వెయ్యి కోట్ల రూపాయలు ప్రభుత్వానికి కట్టాలని ఒత్తిడి తెచ్చారని, అలా కట్టని పక్షంలో పోర్టు స్వాధీనం చేయాలని బెదిరించి లొంగతీసుకోవటంతో పాటు షిప్పింగ్ ఏజెంట్లను భయపెట్టారని, కేవీరావు వాటా అమ్మే వరకూ గొంతుమీద కత్తి పెట్టి మరీ బెదిరించారని ఆనం వెంకట రమణారెడ్డి దుయ్యబట్టారు. కాగా వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. ఆయనతోపాటు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో యజమాని శరత్ చంద్ర రెడ్డిపై ఎల్వోసీ ఇచ్చింది. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగాసర్క్యులర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ. 3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు, కేవీ రావు నుంచి గత ప్రభుత్వ హయాంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో కీలక నిందితులుగా వీరున్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 06-12-2024

## కాంగ్రెస్ పదే పదే ఎందుకు విఫలమవుతోంది?

సార్వత్రిక ఎన్నికల్లో వంద స్థానాలు గెలిచి ఉత్తరాధిలో కొద్దిగా పుంజుకున్నట్టు కనిపించిన కాంగ్రెస్ కు మళ్లీ దెబ్బ మీద దెబ్బ. ఎంత బలంగా జనంలోకి వెళ్లినా బీజేపీ ముందు నిలువ లేకపోతోంది. ఆ పార్టీ విజయ పరంపరను అడ్డుకోవటంలో ఘోరంగా విఫలమవుతోంది. గెలిచిన రాష్టాల్లోనే బీజేపీ మళ్లీ మళ్లీ గెలుస్తోంది. పైగా, గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్లు సాధిస్తోంది? ఇటీవలి హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు మంచి ఉదాహరణలు. అంతకు ముందు మధ్యప్రదేశ్. కాంగ్రెస్ గెలుస్తుంది అనుకున్న చోటల్లా ఓటమి పాలవుతోంది. ఎక్కడ పొరపాటు జరుగుతోంది? కాంగ్రెస్ ఎప్పటికైనా అధికారం చేజిక్కించుకోగలదా? కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తాజా సమావేశంలో పాల్గొన్నఅందరిలోనూ ఈ ప్రశ్నలే. వారు సాధారణ నేతలు కాదు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఈ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చను చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి ముగించారు. ఇది చాలా రొటీన్ గా జరిగేదే. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హర్యానా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఈ కమిటీల వల్ల ఏమి జరుగుతుందుతో ఎవరికీ తెలియదు. మరోవైపు, బీజేపీ ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో ఎన్నికలు సదా సిద్ధంగా ఉంటుంది. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీలో ఈ కసి ఏ కోశానా కని పించదు. కనీసం ఒక ఏడాది ముందైనా మనం ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జులన ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోడీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదనే విషయం ఖర్గే మాటల ద్వారా స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ వద్ద ఎప్పుడూ ఒకటికి మించిన వ్యూహాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ప్రత్యర్థి పార్టీలను బలహీన పరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. వివిద రూపాలలో ఉన్నఆ పార్టీ క్యాడర్ నిరంతరం ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునే పనిలో నిమగ్నమై ఉంటాయి. వీటన్నిటికి తోడు ప్రధాని మోడీ కేంద్రంగా అభివృద్ధి మంత్రాన్ని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయి స్తూనే ఉంటాయి ఆ పార్టీ శ్రేణులు. అన్నిటికి మించి పార్టీకి పుష్కలంగా నిధులున్నాయి. వెరసి, గెలిచిన రాష్టాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కిం చుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఇక. కాంగ్రెస్ పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. ఆ పార్టీ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హర్యానలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హర్యానా వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు?అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ పుట్టిందని జనం అనుకుంటారా? బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్దాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. ఓటమి పాలైనపుడు ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకునివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచించేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనే శక్తిగా ఆవిర్భవించ గలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల పక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే అధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది.

## ఈ ఎన్ టీ డాక్టర్ కు ముప్పై ఏళ్ళ కృషి కి జాతీయ జీవితకాల సాఫల్య పురస్కారం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 05- ఈ ఎన్ టీ డాక్టర్ మదుసుదన్ రావు కు ముప్పై ఏళ్ల కృషి కి జాతీయ జీవిత కాల సాఫల్యం పురస్కారం అవార్డు లభించిందని డాక్టర్ రవి కృష్ణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భారతీయ వైద్య సంఘం ప్రతిఏటా నిర్వహించే జాతీయ మహాసభల సందర్భంగా ఇచ్చే పురస్కారాలలో భాగంగా, దేశంలో ఒక వైద్యునికి అందించే ఐఎంఏ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు (జీవితకాల సాఫల్య పురస్కారం) ఈ సంవత్సరం నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావును అవార్డ్స్ కమిటీ ఎంపిక చేసిందని ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి అనిల్ నాయక్ ఢిల్లీ కేంద్ర కార్యాలయం నుండి రాష్ట్ర ఐఎంఏ శాఖకు సందేశం పంపించారని తెలిపారు . డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావు గత మూడు దశాబ్దాలకు పైగా నంద్యాల ప్రాంతంలో చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులుగా చేస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, ప్రతి ఏటా గత 17 సంవత్సరాలుగా దేశంలోని యువ ఈ ఎన్ టీ వైద్యులకు ప్రత్యక్ష శస్త్ర చికిత్సల కార్యశాల నిర్వహించి శిక్షణ ఇస్తున్నారని అవార్డ్స్ కమిటీ ఎంపిక ప్రకటనలో తెలిపారన్నారు. అంతేకాకుండా ప్రతి ఏటా గత 30 సంవత్సరాలుగా ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నారని,అదే విధంగా సామాజిక, కళా సేవలు విస్తృతంగా చేస్తున్నారని ప్రశంసించారు. ఈ అవార్డు ను డిసెంబర్ 27,28 వ తేదిలలో హైదరాబాద్ లో నిర్వహించ నున్న 99 జాతీయ మహా సభలలో అందచేసి సత్కరిస్తారు.ఐఎంఏ ప్రతిఏటా జాతీయ మహాసభల సందర్భంగా నలుగురిని దేశవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యుల నుండి విశిష్ట పురస్కారాల కోసం ఎంపిక చేస్తారు. వాటిలో రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు డాక్టర్ మధుసూదనరావుకు, గతవారం ప్రకటించిన సామాజిక సేవలకు అందించే డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలి స్మారక పురస్కారం డాక్టర్ రవి కృష్ణ ఎంపిక కావడం, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన వైద్యులు కావడం విశేషమని ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఐఎంఏ నంద్యాల వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి సంతాపం వ్యక్తం చేసిన మోటార్ వర్కర్స్ యూనియన్..





. విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-డిసెంబర్ 5 డోన్ మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన జి.ప్రవీణ్ కుమార్ 35 రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఆయన మృతికి డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శివరాం,నాయకులు కె.వెంకటేశ్వర్లు,ఎస్.భాస్కర్ సంతాపం వ్యక్తం చేశారు.గురువారం ఎర్రగుంట్ల గ్రామంలోని మృతుని స్వగృహం నందు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం వారు మాట్లాడుతూ మృతుడు అతి చిన్న వయసులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం జడ్చర్ల దగ్గరలో గల బాలానగర్ లో లారీ అన్లోడింగ్ పాయింట్ వద్ద వాహనాన్ని ఆపి టీ త్రాగడానికి రోడ్డు సైడ్ నడుచుకుంటూ వెళుండగా వెనుక వైపు నుంచి జీపు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయనకు భార్య,ఇరువురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు,క్లీనర్ల నుండి సమకూరిన రూ.21,000/ వేలు,లారీ యజమాని నుండి అంత్యక్రియలకు రూ.15,000/ వేలు కలిపి మొత్తం 36,000 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వారు తెలిపారు.కె.మద్దిలేటి,మోహన్ రావు, రమణయ్య,వెంకట రాముడు,నక్కవెంకటేష్,మహేష్, గిడ్డయ్య,బాలు ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు,ఓనర్లు,క్లీనర్లు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

## మింగుడు పడని పవన్ వ్యవహారం

నెల్లూరు, డిసెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ ఎంట్రీ ఎలా జరిగినా గత ఎన్నికల్లో మాత్రం గ్రాండ్ వెల్ కమ్ జరిగిందనే చెప్పా?లి. జనసేన పార్టీ వంద శాత స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లోనూ గెలిచింది. అయితే పవన్ కల్యాణ్ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించాలనుకుంటున్నారు. తన,మన అనేది లేకుండా అవినీతికి తావివ్వని పాలన అందివ్వాలన్న ఆలోచనతో ఉన్నారు. ప్రత్యర్థులను ఒకవైపు కట్టడి చేస్తూనే కూటమి పార్టీలలో జరుగుతున్న తీరును కూడా ఎండగట్టేందుకు ఆయన ఏమాత్రం వెనకాడటం లేదు. కానీ పవన్ కల్యాణ్ చర్యలు కొందరు కూటమి నేతలకే రుచించడం లేదు. ప్రధానంగా టీడీపీ నేతలు పవన్ కల్యాణ్ ఇలా వ్యవహరిస్తే తమ పరిస్థితి ఏంటన్న భావనకు వచ్చారు. పవన్ కల్యాణ్ మొన్నటి వరకూ మౌనంగానే ఉన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, అటవీ శాఖలను ఏరి కోరి తీసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖలపై అధ్యయనం చేసిన తర్వాత రంగంలోకి దిగారు. తిరుపతిలో సనాతన ధర్మం అంటూ సభను ఏర్పాటు చేసి ఒకింత బీజేపీతో పాటు టీడీపీకి కూడా తన ఆలోచనలను చెప్పకనే చెప్పారు. తర్వాత కొద్దిరోజులు గ్యాప్ ఇచ్చి హోం శాఖపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హోంశాఖను తాను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హోం శాఖ సరిగా పనిచేయడం లేదని ఆయనే విమర్శలు చేసి సొంత కూటమి ప్రభుత్వాన్నేఇరుకున పెట్టారు. అది ఏ ఉద్దేశ్యంతో చేసినా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని డ్యామేజి చేశాయి. అయినా చంద్రబాబు పవన్ కల్యాణ్ ను పిలిపించుకుని మాట్లాడారు. శాంతిభద్రతల సమస్యను సీరియస్ గా తీసుకున్న చంద్రబాబు వరసగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా మిత్రపక్షాలయిన వారికి కొంత ఇబ్బంది పెట్టినా పవన్ చేసిన పనికి ప్రత్యర్థులపై కేసులు నమోదవుతున్నాయని అని కొందరు సంతృప్తి చెందారు. తాజాగా కాకినాడ పోర్టుకు వెళ్లి హడావిడి చేసిన పవన్ కల్యాణ్ అక్కడ ఇంకా రేషన్ బియ్యం విదేశాలకు స్మగ్లింగ్ అవుతున్న విషయాన్ని బాహ్య ప్రపంచానికి తెలియపర్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతుంది. పోలీసులు, అధికారులు కూటమి ప్రభుత్వం చెప్పినట్లు వినేవారే. కా?నీ పవన్ చేసిన హడావిడికి అది రివర్స్ లో ప్రభుత్వానికే డ్యామేజీ అయింది. రేషన్ బియ్యం పెద్దయెత్తున తరలిపోతున్నాయంటూ చేసిన కామెంట్స్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. రేషన్ మాఫియాను అరికడతామని ఆయన చెప్పినప్పటికీ ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అందరూ అనుకోవాల్సి ఉంటుంది. పయ్యావుల కేశవ్ వియ్యంకుడే మాఫియాకు మార్గదర్శి అని అనడం కూడా మరింత రచ్చగా మారింది. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని పవన్ కోరారని తెలిసింది.మరికొన్ని విషయాల్లో పట్టుబ ట్టాలి.కానీ పవన్ కల్యాణ్ మాత్రం తన, మన లేకుండా ఫైర్ అవుతుం డటంతో కూటమి ప్రభుత్వానికే ఇబ్బందిగా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## 7 వతేదిన మెగా పేరెంట్ టీచర్ సమావేశం

### ఘనంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 05–ఈనెల 7వ తేదీ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భారీ సమావేశానికి ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పుర ప్రముఖులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 995 ప్రాథమిక పాఠశాలలు, 110 ప్రాథమికోన్నత పాఠశాలలు, 294 ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తము 1399 పాఠశాలల్లో పెద్ద ఎత్తున మెగా ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలతో అందరినీ ఆహ్వానించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 1.54 లక్షల మంది విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. డిసెంబర్ 7వ తేదీన పండుగ వాతావరణంలో నిర్వహించుకొనే మెగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భారీ సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



## టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 05–నంద్యాల జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా ఆర్ వెంకటరమణ టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ను ఆకస్మికముగా తనిఖీ చేశారు . వైద్యాధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సమయ పాలన తప్పని సరిగ్గా పాటించాలని లేనిచో కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లోని ఒపీ విభాగాన్ని మరియు అక్కడ వున్నటువంటి రోగులకు, వారికి అందె సేవలు మరియు చికిత్సలు,మందులు, వారి పట్ల వైద్యాధికారి మరియు వైద్య ఆరోగ్యసిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు రికార్డులను మరియు రిపోర్టులను తనిఖీ చేశారు . ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో జాతీయ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల మెటీరియల్ ప్రదర్శన ను అవగాహన కొరకు ప్రజలకు మరియు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు . కాన్పు వార్డును పరిశీలించి కాన్పు కొరకు వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీ ని వీలైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యే విధముగా జాగ్రత్త వహించాలని అన్నారు. బాలింత స్త్రీ కి మరియు పుట్టిన బిడ్డకు అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని వారికి రావలసిన రాయితీలు సరైన సమయములో అందించాలని సూచించారు.

## 47 కిలోమీటర్ల పరిధిలో వైజాగ్ మెట్రో

విశాఖపట్టణం, డిసెంబర్ 5, విశాఖపట్నం.. వేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీ. అభివృద్ధి తోపాటు.. ట్రాఫిక్ కష్టాలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. అటు సిటీ విస్తరిస్తోంది. దీంతో మెట్రో సర్వీసు అనివార్యమైంది. ఏళ్ల తరబడి మెట్రో డిమాండ్ ఉంది. ఎట్టకేలకు అది సాకారం కాబోతోంది.విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తాజాగా.. మొదటి దశలో చేపట్టే పనుల డీపీఆర్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ నిర్ణయంపై విశాఖ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే విశాఖలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం లభిస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారుడీపీఆర్ ప్రకారం.. విశాఖ మెట్రో మొదటి దశ ప్రాజెక్టు సుమారు 47 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. ఇందులో గురుద్వారా–పాత పోస్టాఫీసు, తాటిచెట్లపాలెం–చినవాల్తేరు, స్టీల్‌ప్లాంటు–కొమ్మాది మార్గాల్లో మూడు కారిడార్లు ఉండనున్నాయి. వీటి మధ్య మొత్తంగా 42 రైల్వే స్టేషన్లు రానున్నాయి. దీనికోసం 11 వేల 498 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు.కారిడార్ 1లో

వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, స్టీల్‌ప్లాంటు, గాజువాక, ఆటోనగర్, బీహెచ్‌పీవీ, షీలానగర్, కాకానినగర్, ఎన్ఏడీ, మాధవధార, మురళీనగర్, ప్రభుత్వ పాలిటెక్నిక్, విమానాశ్రయం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, గురుద్వారా, ఎంవీపీ కాలనీ, వెంకోజిపాలెం, హనుమంతువాక, మద్దిలపాలెం, ఆదర్శనగర్, జూపార్క్, ఎండాడ, శిల్పారామం, మధురవాడ, కొమ్మాది, క్రికెట్ స్టేడియం స్టేషన్లు ఉన్నాయి.కారిడార్ 2లో గురుద్వారా– పాత పోస్టాఫీసు మధ్య సుమారు 5 కిలోమీటర్లు ఉండనుంది.

# ఇరిగేషన్ ప్రాజెక్టులపై సర్కార్ దృష్టి

విజయవాడ, డిసెంబర్ 5, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన పునరావాసం, పరిహారం, భూసేకరణల కోసం ప్రభుత్వం రూ. 996 కోట్లను విడుదల చేసింది. 2026నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఒక యజ్ఞంలా, 2027 నాటికి నిర్మాణం పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి నిమ్మల తెలిపారు. డిసెంబర్ రెండోవారంలో ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. అదేరోజు పోలవరం నిర్మాణానికి సంబంధించిన టైమ్ షెడ్యూల్ ను కూడా విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఒక రోజు గానీ, ఒక గంట గానీ వృథా కాకూడదని సీఎం చెప్పారని మంత్రి వివరించారు. 10 రోజుల్లో మరింత క్లారిటీ తీసుకుని షెడ్యూల్ తయారు చేయడం జరుగుతుందన్నారు.పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించిన రూ.996 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేసేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో పోలవరం ప్రాజెక్టు 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని మంత్రి వివరించారు. పోలవరం విషయంలో అంతర్రాష్ట్ర సమస్యలకు సంబంధించి చత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాలతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని కచ్చితంగా పోలవరం ఫలాలు రాయలసీమ, ఉత్తరాంధ్రలకు కూడా అందిస్తామన్నారు.

హంద్రీ-నీవా:

రాయలసీమకు లైఫ్ లైన్ వంటి హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.5 కూడా కేటాయించలేదని ఆరోపించారు. హంద్రీ-నీవాను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ నెలలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్ పనులు మొదలుపెడతామన్నారు. డిసెంబర్-జనవరి నెలల్లో హంద్రీ-నీవా పనులు ప్రారంభిస్తారు.

చింతలపూడి:

4 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించే బహుళార్థక ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ కు రూ.73 కోట్ల పెనాల్టీ విధించారని గుర్తు చేశారు. 3 నెలల్లో అనుమతులు తీసుకోవాలని చెప్పినా, పట్టించుకోకపోవడంతో 3 సంవత్సరాలు ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో చింతలపూడి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసేశారన్నారు.

వెలిగొండ:

ప్రాజెక్టుల విషయంలో గత ఐదేళ్లు పాలకులు మొద్దు నిద్రపోయారని, అవాస్తవాలు-అసత్యాలు వెల్లడించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితిని సమీక్షించారని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల సమయంలో రైతులను కూడా దగ్గరకు రానీయకుండా ప్రాజెక్టును అంకితం చేస్తున్నామని అసత్య ప్రచారాలు చేశారన్నారు. 2026 జూన్ కల్లా వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకొచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

వాటర్ పాలసీ:తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా.. ప్రతి ఎకరాకు నీళ్లిచ్చేలా, ప్రతి గ్రామానికీ తాగునీరందించేలా వాటర్ పాలసీ తీసుకురావడం జరుగుతోందన్నారు. ఇటీవల వర్షాలు, వరదలు వచ్చినప్పుడు 11 వేల టీఎంసీలు నీళ్లు రాష్ట్రానికి వచ్చినా వాటిలో 954 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలన్నా లక్ష్యంతో.. వరదలొచ్చినా, కరువు కాటకాలొచ్చినా రాష్ట్రాన్ని కాపాడాలన్న ముందుచూపుతో వాటర్ పాలసీ తీసుకురావడం జరుగుతోందన్నారు.

నదుల అనుసంధానం:ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా .. సవాళ్లెన్ని ఎదురైనా గోదావరి - కృష్ణా - పెన్నా నదుల అనుసంధానం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారని గోదావరి - కృష్ణా - బనకచర్ల ప్రాజెక్టు ఇదొక గేమ్ ఛేంజర్ అని స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను మళ్లించి ప్రతి ఎకరాకూ సాగునీరందించాలంటే నదుల అనుసంధానం జరగాల్సిందేనన్నారు. రాష్ట్రం రూపు రేఖలు మార్చే నదుల అనుసంధానాన్ని 2-3 ఏజెన్సీలతో తక్కువ ఖర్చుతో చేపట్టేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా పవన్



తిరుపతి, డిసెంబర్ 5, జనసేనాని అటె పాలనలో, అటు పాలిటిక్స్ లో తన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. నాయకత్వానికి సిసలైన బ్రాండ్ గా మారారు పవన్. తన స్థాయి ఏంటో, స్టామినా ఏంటో దేశానికి పరిచయం చేశారు. కూటమిలో ఒకడిలా కాకుండా కూటమికి ఒక్కడిలా ఎదిగారు పవన్. ఇచ్చిన మాట కోసం ఎంత దూరమైన వెళ్లే రకం పవన్. ఆ గుణమే ఆయనను లీడర్ గా నిలబెట్టింది. మహారాష్ట్ర ఫలితాల తర్వాత పవన్ క్రేజ్ పై దేశవ్యాప్తంగా కొత్త చర్చ మొదలైంది. ఆయన పాన్ ఇండియా పొలిటికల్ స్టార్ గా మారబోతున్నారా? పవన్ ఏది అడిగినా మోదీ సర్కార్ వెంటనే ఓకే చెబుతోంది కూడా అందుకేనా? ఎన్డీయేలో పవన్ ఈ రేంజ్ ప్రాధాన్యత వెనక అసలు కారణం ఏంటి? రాజకీయంగా పవన్ కల్యాణ్ అడుగులు ఇకపై ఎలా ఉండే ఛాన్స్ ఉంది? ఢిల్లీ టూర్ తర్వాత తెరమీదకు వస్తున్న ప్రశ్నలు ఏంటి?పవన్ కల్యాణ్ అనేది పేరు మాత్రమే కాదు.. ఓ ఎమోషన్. చాలామంది అభిమానులు, అనుచరులు చెప్పే మాట ఇది. రాజకీయ నాయకుడు కాదు రాజకీయం తెలిసిన నాయకుడు అని పవన్ గురించి గర్వంగా చెబుతుంటారు ఫ్యాన్స్. దానగుణం, సమస్యలపై స్పందించే తీరు.. రాజకీయాలకు అతీతంగా ఆయనను నిజమైన లీడర్ గా నిలిపింది. ఈ క్రేజే కోట్ల మంది అభిమానులకు కారణమైంది. ఆయన మాటను శాసనంగా మార్చింది అనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి.ఆయన ఓ మాట అన్నా, ఓ నిర్ణయం తీసుకున్నా ఆ రేంజ్.. ఇంకో లెవెల్ అంతే. అదే ఇప్పుడు ఎన్డీయేకు కలిసి వస్తుందా అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. అందుకే పవన్ కల్యాణ్ కు ఎన్డీయే ఎక్కడ లేని ప్రాధాన్యం కల్పిస్తోంది. కూటమిలో ఒకడిలా కాకుండా కూటమికి ఒక్కడిలా చూస్తోంది. ఢిల్లీలో ఆయన చక్రం తిప్పడానికి కారణం కూడా అదే.పవన్ ప్రచారం చేస్తే చాలు.. ఓట్లు వచ్చి పడుతున్నాయి. మహారాష్ట్రలో అదే జరిగింది. పవన్ ప్రచారం చేసిన ప్రతీ చోట ఎన్డీయే కూటమి అద్భుత విజయం సాధించింది. పవన్ ప్రచారం వల్లే గెలిచామని ఎమ్మెల్యేలు బహిరంగంగా చెబుతున్నారంటే ఆయన క్రేజ్ అర్థం చేసుకోవచ్చు.ఏపీలో కూటమి ఏర్పాటులో కీలకంగా కనిపించిన పవన్.. విజయంలోనూ అదే స్థాయి పాత్రను పోషించారు. ఈయన పవన్ మాత్రమే కాదు.. తుపాను అని స్వయంగా ప్రధాని మోదీ అంతలా పొగిడింది అందుకే. సొంత ప్రభుత్వంలోని లోపాలను కూడా ఎలాంటి మొహమాటం లేకుండా ఎత్తి చూపుతూ పాలనలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం పై పవన్ స్పందించిన తీరు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు యావత్ దేశంలోనూ ప్రకంపనలు క్రియేట్ చేశాయి.

## రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది

**బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు బడికిల శ్రావణ్**

**మా బిడ్డల ప్రాణాలంటే అంత చులకన**

**లోపలికి అనుమతించకపోవడంతో, గేటు ముందు ధర్నా**

తాండూర్ డిసెంబర్ 5,తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నది ప్రజా పాలన కాదు రాక్షస పాలన జరుగుతున్నదని బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు బడికిల శ్రావణ్ మండిపడ్డారు ఈ మేరకు గురువారంతాండూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఓఏః గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చిన సందర్భంగా లోపలికి అనుమతించకపోవడంతో అక్కడి వసతి గృహం గేటు ముందు బైఠాయించి ధర్నా అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్టీ కార్యక్రమం గురుకుల బాటలో భాగంగా గురువారం తాండూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఓఏః గురుకుల సందర్శనకు వెళ్లిన ఆయనను యాజమాన్యం అనుమతించలేదు. దీంతో ఃఖీూఎ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ముందు ధర్నాకు దిగారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, సౌకర్యాలను అధ్యయనం చేసేందుకు వచ్చిన తమరిని పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. పాఠశాల గేటు ముందు ఆందోళనలు దిగిన బడికల శ్రావణ్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాలలో సౌకర్యాలు సరిగా లేక ఫుడ్ పాయిజన్ తో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 48 మంది విద్యార్థులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో 1000కి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి గొప్పగా సౌకర్యాలు కలిపిస్తే.. కాంగ్రెస్ ప్రజా పాలనలో భ్రష్టు పట్టిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోకూడదనే ఒక కుట్రపూరిత ఆలోచనతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు నిధులు కూడా కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలు పేరుతో అధికారంలోకి ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. గురుకులల్లో సరైన సౌకర్యాలు లేక అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురుకులాలపై కనీసం సమీక్ష చేసే సమయం కూడా లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును అర్థం చేసుకోవాలని అన్నారు. పేద పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## న్యూ ఇయర్.. హామీలకు లైన్ క్లియర్

విజయవాడ, డిసెంబర్ 5,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో మాదిరి కేవలం అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టడం లేదు. సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో జరపాలన్న నిర్ణయానికి వచ్చారు. నిధులు పెద్దగా అందుబాటులో లేకపోయినా ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కొంత సానుకూలంగా వ్యవహరించడం, మద్దతుగా నిలుస్తుండం చంద్రబాబు ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశంగా చూడాలి. రుణాల విషయంలోనూ, నిధుల మంజూరు లోనూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎక్కువగా రాష్ట్రానికి విడుదల చేయడంలోనూ ఢిల్లీ పెద్దలను సహకరిస్తుండటంతో చంద్రబాబు సంక్షేమానికి పెద్దపీట వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నాలుగు వేల రూపాయలు నెలకు పింఛను ఇస్తున్నారు. దివ్యాంగులకు ఆరువేల రూపాయల పింఛను నెలకు అందిస్తున్నారు. దీంతో పాటు కొత్తగా మరో ఆదేశం కూడా జారీ చేశారు. ఎవరైనా పింఛను తీసుకుంటూ ఆ ఇంట్లో పెద్ద మరణిస్తే వెంటనే వితంతు పింఛనును మంజూరు చేయాలని, ఆ నెలలో పింఛను మొత్తం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇది పేదకుటుంబాలలో పెద్దలను కోల్పోయిన వారికి ఎంతో ఊరట కల్గించే అంశంగానే చూడాలి. దీంతో పాటు సంక్రాంతి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా ప్రవేశపెట్టాలన్న యోచనలో ఉన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినచంద్రబాబు వచ్చే నెలలో దీనికి సంబంధించిన కీలక ప్రకటన చేస్తారని తెలిసింది. వచ్చే నెలలో జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై ప్రకటన చేస్తారని తెలిసింది. ఇక రైతులకు పెట్టుబడి సాయాన్ని కూడా జనవరి నెలలోనే ప్రకటించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకూ రైతులకు పెట్టుబడి సాయాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందివ్వలేదు. ఎన్నికల్లో ఇచ్చినహామీల అమలులో భాగంగా ఎకరానికి ఇరవై వేల రూపాయలు ఇస్తామని చంద్రబాబు నాయుడు నాడు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి ఎంత ఖర్చవుతుంది? ఎంత నిధులు కావాలి? అన్న దానిపై అధికారులను చంద్రబాబు ఆదేశించినట్లు తెలిసింది.సంక్రాంతి నాటికి రైతుల పండగ రోజు ఈ పథకాన్నిఅమలు చేసే విధంగా చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలియవచ్చింది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం కూడా మిగిలిన నిధులను జమచేసి రైతుల ఖాతాల్లో జమచేయనుంది. ఇక మరో ముఖ్యమైన పథకం తల్లికి వందనం. దీనిని కూడా జనవరి నెలలోనే ప్రకటించే అవకాశాలున్నాయి. మార్చి నెలతో విద్యాసంవత్సరం పూర్తవుతుంది. తిరిగి జూన్ నెల నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లికి వందనం కింద ప్రతి ఏడాది ఒక్కో విద్యార్థికి పదిహేను వేలు ఇస్తామని ప్రకటించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి దీనిని కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొం దించాలని, మొత్తం ఖర్చవుతుందన్న వివరాలను తనకు అందివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మొత్తం మీద సంక్రాంతి నాటికి దాదాపు చాలా వరకూ ముఖ్యమైన పథకాలను అమలు చేసేందుకు అవసర మైన తేదీలను చంద్రబాబు ప్రకటించే అవకాశాలున్నాయి.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెల్లమ్మ జర జాగ్రత్త అవగాహన సదస్సు

కర్నూలు,స్థానిక ఆస్పరి నందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఓ చెల్లమ జర జాగ్రత్త అంశం పై సదస్సు నిర్వహించడం జరిగినది ఈ సదస్సు కు రవి అధ్యక్షత వహించి అదేవిధంగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ట్రైనర్ డీఎస్పీ ఉషశ్రీ మేడం గారు, యూటీఎఫ్ జిల్ల అధ్యక్షులు జీవిత గారు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నరసింహులు, మరియు విజేత కరస్పండెండ్స్ మల్లేష్,ధనలక్ష్మి వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న బాలికలు రక్షణ ఏలా కల్పించుకోవాలి అదే విధంగా సమాజంలో ఉన్నటువంటి బాలికలకు రక్షణ లో ఏ విధంగా పోలీసు వారు రాజ్యాంగం లో ఉన్న రక్షణ ఐపిసి సెక్షన్ ఉపయోగపడుతుందని అదేవిధంగా సమాజంలో మనవామృగాలు మధ్య సమస్యలు ఏర్పడినప్పుడు దేనికి భయపడవద్దని శక్తి గా ముందుకెళ్లాలని వారు మాట్లాడారు

## అన్నప్రసాద వితరణ విభాగాన్ని పరిశీలించిన కార్యనిర్వాహణాధికారి

శ్రీశైలం,దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఎం. శ్రీనివాసరావు అధికార బాధ్యతలను స్వీకరించారు.అనంతరం ఆయన దేవస్థానం అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.అన్నప్రసాదవితరణ మందిరంలోని భోజనశాలలు, పాకశాల, కురగాయలు నిల్వచేసే కోల్డ్ స్టోరేజ్, అన్నప్రసాదాల స్టోరు మొదలైనవాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాల వితరణలో వండుతున్న రోజువారి వంట వివరాలు మొదలైన వాటిని అడిగితెలుసుకున్నారు. వంటశాలలో ఈ రోజు అన్నప్రసాదవితరణకు వండిన వంటకాలను కూడా పరిశీలించారు.వంటకాలన్నింటిని రుచికరంగా తయారు చేస్తుండాలని పాకశాలసిబ్బందికి సూచించారు. ఈ విషయమై అధికారులు ఎప్పటికప్పుడు తగు పర్యవేక్షణ చేస్తుండాలన్నారు.అదేవిధంగా అన్నప్రసాదాలను స్వీకరించేందుకు వచ్చిన భక్తులతో మర్యాదతతో మెలగాలని అన్నప్రసాద వితరణ సిబ్బందిని ఆదేశించారు.ముఖ్యంగా వంటశాలను, భోజనశాలను మరియు అన్నదాన ప్రాంగణమంతా కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ అన్నప్రసాదవితరణలో రోజువారిగా ఉపయోగించే కూరగాయలన్నీ తాజాగా ఉండాలన్నారు. తరువాత వారు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించి అన్నప్రసాదవితరణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తులందరు కూడా దేవస్థానం అందజేస్తున్న అన్నప్రసాదాల పట్ల పూర్తి సంతృప్తివ్యక్తం చేశారు.

తరువాత కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలించారు. క్షేత్రపరిధిలో వివిధ చోట్ల ఏర్పాటు చేయబడిన సీసీ కెమెరాల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు కార్యనిర్వహణాధికారివారికి వివరించారు

## మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను తిరుపతి నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**

**క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా.. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు**

**తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**ప్రతి ఒక్కరు మానసిక, శారీరక దృఢత్వం కోసం క్రీడల వైపు ఆసక్తి చూపాలి**

**శాప్ ఛైర్మన్ రవి నాయుడు**

**నగరపాలక సంస్థ నుంచి క్రీడాకారులకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుంది.**

**నగర పాలక కమిషనర్ మౌర్య**

తిరుపతి, తిరుపతి నగర ప్రజలందరికి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందని, నగర ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ డా .ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.గురువారం స్థానిక ఇందిరా మైదానం నందు ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, రవినాయుడు తో కలిసి జిల్లా కలెక్టర్ శిలాఫలకం గావించి కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...తిరుపతి నగర ప్రజలందరికి కోసం మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. సుమారు రూ. 8.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందన్నారు. ప్రజలకు క్రీడాకారులకు పలు రకాల క్రీడలను అందుబాటులోకి తీసుకొని రానున్నామని శుభ పరిణామమని తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం నందు బాస్కెట్ బాల్ , వాలీబాల్ షటిల్ వంటి క్రీడలతో పాటు ఇండోర్ క్రీడలు అందుబాటు లోకి వచ్చాయని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ నందు రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉంటాయని అన్నారు, మొదటి అంతస్తు నందు రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు, రెండు క్యారమ్ బోర్డులు, ఒక ఎయిర్ హాకీ, ఒక పూల్ టేబుల్ కోర్టులు, రెండవ అంతస్తులో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను శాసనసభ్యులు, శాప్ ఛైర్మన్, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈరోజు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నిరంతరాయంగా తిరుపతి ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఎల్లప్పుడూ క్రీడలు నిర్వహణ జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ... క్రీడాకారులను ప్రోత్సహించే దశగా మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను తిరుపతి ప్రజలకు అందరికీ అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో తిరుపతి ఆధ్యాత్మిక నగరానికి స్మార్ట్ చేసిన తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. 2018-19 సంవత్సరంలో ఇండోర్ స్టేడియం కు అనుమతులు రావడం జరిగిందని తెలిపారు. ఆ రోజే ఇండోర్ స్టేడియం మంజూరు చేసిన పనులు పూర్తి అయి పూర్తిస్థాయిగా ఈరోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం, తిరుపతి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడం సంతోషంగా ఉందని తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో బాస్కెట్ బాల్, టెన్నిస్, వాల్ బాల్ వంటి వంటి ఆటలను క్రీడాకారులకి అందుబాటులోకి తీసుకొని రావడం జరిగింది అని తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి అభివృద్ధి పనులు, మున్సిపల్ నిధులతో తిరుపతి నగరలో గుంతలు లేని రోడ్ల లేని పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కావున తిరుపతి నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ను క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చాలని సంకల్పంతో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడల ఎంతో ముఖ్యమని వీటిపై ఆసక్తి చూపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయంతో నేడు తిరుపతి లోని క్రీడాకారులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈరోజు మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. తిరుపతి ని స్పోర్ట్స్ హబ్ గా మార్చాలని సంకల్పంతో తిరుపతి నగరం జాతీయ క్రీడలకు వేదిక కావాలని ఆలోచనతో స్టేడియం ఏర్పాటుకు రూపకల్పన జరిగిందని అన్నారు. ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ రాష్ట్రాన్ని క్రీడాంధ్ర ప్రదేశ్ మార్చేలా స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తుందని తెలిపారు.కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో క్రీడాకారులు ప్రోత్సహించేందుకు ఈ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతో ఉపయోగపడుతుందని, క్రీడాకారులందరూ ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సద్వినియోగం చేసుకుని తిరుపతి ఖ్యాతిని దశ దిశలా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ నుంచి క్రీడాకారులకు ఎప్పుడు ప్రోత్సాహం ఉంటుందని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తో కలిసి వాలీబాల్, టెన్నిస్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు.

## శ్రీశైలం ఈవోగా శ్రీనివాసరావు బాధ్యతలు...



విభారే న్యూస్ డిసెంబర్ 05 శ్రీశైలం...శ్రీశైలం దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు ఆలయ పరిపాలన భవనంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైలాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కృషి చేస్తానని ఆయన తెలిపారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి వహిస్తానని, దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. అనంతరం పలువురు సిబ్బంది నూతన ఈవోకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 7వ తేదీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ డిసెంబర్ 05 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి వారి దేవాలయం లో 07-12-24,శనివారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత వైభవోపేతంగా



అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు,సుబ్రహ్మణ్య హోమము,శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణం, కావడి సేవ,తదితర కార్యక్రమాలు జరుగుతాయి..సాయంత్రం 5:30 గంటలకు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణం జరుగుతుంది.సుబ్రహ్మణ్య ఆరాధన వల్ల సంతాన సమస్యలు, ఆరోగ్య సమస్యలు,భూ సమస్యలు,వివాహ సమస్యలు,ఇంకా పిల్లల విద్య, ఆరోగ్య సమస్యలు అన్నీ స్వామి వారి కృప వల్ల పరిష్కరింపబడతాయి.. స్వామి వారి కృపకు పాత్రులవుతారు..అభిషేకం - 200/-కావడి సేవ -250/-మాసపూజ - 300/-నిత్య పూజ -3000/ -సుబ్రహ్మణ్య హోమం -స్వామి వారి కళ్యాణం -(దయచేసి రెండు రోజులు ముందు సంప్రదించండి)సంప్రదించండి :-శ్రీధర్ శర్మ -7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్:8896123777.

## 6వ తేదీ శుక్రవారం రోజు కార్తీకదీపం ముగింపు కార్యక్రమం..

విభారే న్యూస్ డిసెంబర్ 05 ఎమ్మిగనూరు..స్థానిక శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయం నందు కార్తీక శుద్ధ పాడ్యమి నుండి 6వ తేదీ శుక్రవారం వరకు కార్తీక దీపోత్సవం పూజా కార్యక్రమాలన్నీయు జరుగుతున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం 06.12.2024 తో దీపోత్సవం కార్యక్రమం ముగియను. శుక్రవారం ఉదయము అభిషేక పూజలు, నందికోలు సేవ, జోల పాట, మహా మంగళహారతి తో పూజా కార్యక్రమం ముగియును. కావున భక్తాదులందరూ పై పూజా కార్యక్రమంలో పాల్గొని పార్వతీ పరమేశ్వరుల కృపకు పాత్రులు కాగలరని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కుటుంబీకులు భక్తులకు తెలిపారు.




## ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు అలసత్వం వీడాలి.. - ఎస్ఎఫ్ఐ..




విభారే న్యూస్ ఎమ్మిగనూరు డిసెంబర్ 5..ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు అలసత్వం విడనాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప పేర్కొన్నారు.గురువారంభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎమ్మిగనూరు పట్టణ కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవన్ నందు పట్టణ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడుతూ ఎమ్మిగనూరులోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ర్యాంకుల వస్తేనే జీవితం లేకపోతే వారికి జీవితం లేదు ర్యాంకుల రాకపోతే ఈ సమాజంలో బ్రతకాలేరన్న అపోహలు, ఆలోచనలను విద్యార్థులకు కల్పిస్తూ వారి మనోధైర్యాన్ని కోల్పోయేలా చేస్తున్నారు. అలాగే విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశాలు నిర్వహించి మీ పిల్లలు సరిగ్గా చదవటం లేదు ఇలానే ఉంటే మీ పిల్లవాడు ఈసారి జరిగే పరీక్షల్లో ఫెయిల్ అవ్వటం తథ్యం అని చెబుతూ మీ వాళ్ళు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి అంటే స్పెషల్ క్లాసులు,పరీక్షలు తప్పనిసరి అంటూ ఫీజుల వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను శారీరకంగా,మానసికంగా ఇబ్బందులు పడుతున్నా భాష్యం,నారాయణ,శ్రీ చైతన్య, పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవటంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలలు పాటిస్తున్న సమయపాలన ప్రైవేట్, కార్పొరేట్ పాటించే విధంగా చూడాలని నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలసి పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడతామాని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు రవితేజ, ఉదయ్,అఖిల్,వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## బీవీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే.

విభారే న్యూస్ డిసెంబర్ 05 ఎమ్మిగనూరు..గత వైసీపీ ప్రభుత్వం క్రీడలకు కూడా రాజకీయం చేసింది.ప్రతి ఏడాది జరిగే శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా మాజీ సీఎం ఎన్టీఆర్ మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత 8 ఏళ్ల నుండి బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మిగనూరు క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2019 వైసీపీ అధికారం వచ్చాక క్రీడా పోటీలకు కూడా రాజకీయం చేసిందని మండిపడ్డారు. టోర్నమెంట్ నిర్వహించడానికి వైసిపి మైదానం కూడా ఇవ్వలేదన్నారు. క్రీడాకారులు ప్రోత్సహించాలంటే ఒక టీడీపీ ప్రభుత్వంతో సాధ్యమవుతుంది అన్నారు.ప్రతి క్రీడాకారుడు ఓటమి గెలుపును సమానంగా స్వీకరించి ముందుకు పోవాలని సూచించారు. ఎమ్మిగనూరు క్రీడాకారుల పాటు అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ లో దాదాపు 136 జట్లు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులను సూచించారు. అనంతరం క్రికెట్




ఆడి ఎమ్మెల్యే బీవీ క్రికెట్ ఆడి టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు సురేష్ చౌదరి, రంగస్వామి గౌడ్, దోమ భీమేష్, ముల్లా జహీర్ అహ్మద్, భార్గవ్ యాదవ్, బసరుకోడు వీరేంద్ర, కృష్ణ తేజ నాయుడు, సోగనూర్ రాఘవేంద్ర, శంకర్ గౌడ్, అమనుల్లా, యు. రఘు, నాగలదిన్నె సుధీర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలి




### ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలి
### మాజీ మంత్రి సాకే శైలజనాథ్

విభారే న్యూస్. డిసెంబర్ 5 కర్నూల్ ప్రతినిధి ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని, ఎన్నికలను బ్యాలెట్ పద్ధతి ద్వారా నిర్వహించాలని మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు సాకే శైలజనాథ్ గారు కేంద్రానికి డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శైలజనాథ్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తుందని ప్రజాస్వామ్య బద్దంగా మాట్లాడితే వారిపైన కక్ష సాధింపు చర్యలతో వేధిస్తుందని, ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కానీ కేంద్రంలో కానీ చట్టానికి కట్టుబడి పని చేయడం లేదని అన్నారు. భారత రాజ్యాంగం కుల మతాలకు అతీతంగా రక్షణ కల్పిస్తుందని సంభాల్లో రాహుల్ గాంధీ గారు పరామర్శకు, నిజా నిజాలు తెలుసుకోవడానికి వెళితే ఈ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కలిగిన రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం విడ్డూరంగా ఉందని ఈ మధ్యకాలంలో ఈవీఎంల పైన అనుమానాలు ఉన్నాయని చెబితే ఈ అంశాన్ని ఎలక్షన్ కమిషన్ దాటవేసే ధోరణిలో మాట్లాడు తుందని హర్యానా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తుందని అందరూ ఊహించారని కానీ అక్కడి ఫలితాలు అనుమానాలకు తావిస్తుందని మహారాష్ట్రలో బిజెపి అభ్యర్థులు గెలిచిన చోట ఐదు గంటల తర్వాత జరిగిన పోలింగ్ లో 7, 8 శాతం ఓట్లు అదనంగా ఫామ్ 17 సి లో ఎన్ని ఓట్లు రికార్డు అయ్యాయి కౌంట్ చేసిన రోజుకు ఐదారు శాతం ఓట్లకు సమాధానం చెప్పేవారు లేరని అన్నారు. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చు అని మాట్లాడిన వ్యక్తిని బెదిరించి అణచివేసే దోరనిలో పోలీసు కేసు పెట్టారని మహారాష్ట్రలోని ఒక గ్రామంలో గ్రామ ప్రజలందరూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేశామని మా ఓట్లు ఎక్కడ పోయాయని గ్రామస్తులు నిలదీస్తే సమాధానం చెప్పేవారు లేరని బిజెపి వారు ఈవీఎంలను మేనేజ్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాల రాస్తున్నారని ఏపీ ఎన్నికలలో దాదాపు 16 లక్షల ఓట్లు తేడా వచ్చాయని సమాధానం చెప్పాలంటే చెప్పేవారు లేరని ఎక్కడ ఈవీఎంలతో ఎన్నికలు జరిగితే అక్కడ బిజెపి గెలుస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వమని మాట్లాడడం లేదని, కూటమి ప్రభుత్వం అని మాత్రమే మాట్లాడుతున్నాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాంతానికి న్యాయం చేయాలని తెలియజేశారు. అనంతరం డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పరిగెల మురళీ కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వ కార్యాలయాలను కర్నూలు నుండి రాజధానికి తరలించాలనే ఆలోచనను మానుకొని కర్నూల్ లోనే కొనసాగించాలని కోరుచున్నామని కర్నూలు జిల్లా నందలి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగు నీటి సమస్యలు తీర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు కాంగ్రెస్ నాయకులు కే వెంకటరెడ్డి, ఐఎన్టీయూసీ అధ్యక్షులు బి బతుకన్న, ఎస్ ప్రమీల, అనంతరత్నం, సయ్యద్ నవీద్ మొదలగువారు పాల్గొన్నారు.

## రెండు రోజుల తనిఖీల్లో 910 కేసులు ఐదు లక్షల జరిమాన-



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 05--నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలిసింగ్,ఎన్ఫోర్స్మెంట్ పనులు జరగాలని ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలో అన్నీ పోలీసు స్టేషన్ పరిదులలో ప్రతి రోజు పోలీసు అదికారులు సదరు కార్యక్రమాలను నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజులలో మట్కా,జూదము,అక్రమ మద్యం, డ్రంకన్ అండ్ డ్రైవ్,రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ విహికల్ ఆక్ట్ ను కట్టుదిట్టంగా అమలు చెయ్యడంతో పాటు విశ్రుత తనిఖీలు నిర్వహించారు . జిల్లాలో పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టగా మొత్తం 37 కేసులు నమోదు చేసి 36 వాహనాలు సీజ్ చెయ్యడం జరిగిందన్నారు . ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా 116 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు .జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తు 910 కేసులు నమోదు చేసి 5,08,395/- రూ జరిమాన విదించడం జరిగిందన్నారు .డోన్ సబ్ డివిజన్ పరిదిలో పేకాట ఆడుచున్న వారిపై దాడి చేసి కేసులు నమోదు చెయ్యడంతో పాటు 05 మందిని అరెస్ట్ చేసి 5720/- రూ స్వాదినం చేసుకోవడం జరిగింది.జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ పనులలో భాగంగా జిల్లా పోలీసు అదికారులు నాటు సారా స్థావరాలపై మరియు అక్రమ మద్యం విక్రయదారులపై దాడి చేసి కేసులు నమోదు చెయ్యడంతోపాటు 50 లీటర్ల నాటు సారాయి,17 (180 ఎమ్ ఎల్ ) అక్రమ మద్యం బాటిళ్లను స్వాదినం చేసుకోవడం జరిగిందని తెలిపారు .

## బెడ బుడగజంగం కులాన్ని షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చండి .

### కేంద్ర మంత్రి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 05--బెడ బుడగ జంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని ఢిల్లీ లో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని బేడ బుడగ జంగం కులం చారిత్రాత్మకంగా అట్టడుగున ఉన్న సమూహం అని, కేంద్ర స్థాయిలో షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉన్నందన్నారు.

## అల్లు అర్జున్ పోస్టర్లల చించివేత

పిఠాపురం,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం పిఠాపురం లో గతంలో ఫ్లెక్సీలు రగడ చోటు చేసుకుంటే ఇప్పుడు పోస్టర్లు రగడ చెలరేగింది. పిఠాపురం అన్న క్యాంటిన్ సమీపంలో పుష్ప-2 సినిమా పోస్టర్లు చించివేసారు. పోస్టర్లపై అల్లు అర్జున్ ముఖాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చించేసారు. వెంకటేశ్వర, అన్నపూర్ణ ధియేటర్లలో పుష్ప-2 సినిమా విడుదల కానున్న సమయంలో ఈ ఘటన జరగడంతో బన్నీ అభిమానులు ఆవేదనలో వుండిపోయారు.

## షిప్ లో రేషన్ బియ్యం గుర్తింపు

కాకినాడ ,కాకినాడ పోర్ట్ లో స్టెల్లా ఎల్ షిప్ లో మల్టీ డిసిప్లనరీ కమిటీ శాంపిల్స్ సేకరించింది. 52 వేల మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల షిప్ లో 38 వేల మెట్రిక్ టన్నుల రైస్ లోడ్ అయినట్లు గుర్తించారు. షిప్ లో 640 మెట్రిక్ టన్నుల రేషన్ రైస్ ఉన్నట్లు సమాచారం. ప్రతి బస్తాను అధికారులు పరిశీలించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**